## ఆర్టీసీ ఆదర్శ సిబ్బందికి సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్ జనవరి 23 : రాజమహేంద్రవరం ఆర్‌టీసీ డిపోలో మంగళవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. డిపో మెయిన్ గేట్ వద్ద జరిగిన సభలో 2023 డిసెంబరులో అత్యధిక ఆదాయం ,అత్యధిక డీజిల్ సేవింగ్స్ సాధించిన సిబ్బందిని ఎంపిక చేసి డిపో మేనేజరు ఎస్‌కె షబ్నం చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులు , ప్రశంసాపత్రం అందజేశారు.



రాజమహేంద్రవరంలో ఆటో డ్రైవర్ల నిరసన ప్రదర్శన

## ఆటో..ఇటో తేల్చుకుంటాం!

### మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకం వ్యతిరేకిస్తూ బంద్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23 : ఆటో ఇటో తేల్చుకుంటాం. అంటూ మహిళలకు ఉచిత బస్ పథకంపై బంద్‌కు దిగారు. జిల్లా వ్యాప్తంగా ఆటోలను ఆపివేసి నిరసన ప్రదర్శన చేశారు. జేఏసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్ పాటించారు. రాజమ హేంద్రవరంలో మంగళవారం జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్(బాక్స్‌ప్రసాద్), నల్లం శ్రీను, బట్లంకి ప్రకాష్‌లు ఆటో కార్మికులతో కలిసి నిరసన ప్రదర్శన చేసి మాట్లాడారు. లక్షలాది కుటుంబాలు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ఇప్పటికే వివిధ ట్యాక్స్‌ల భారంతో ఇబ్బందులతో ఆటో వర్కర్లు నెట్టుకొస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశ పెడితే ఆటో కార్మికులు జీవితాలు అగమ్యగోచరమవుతాయన్నారు. కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం వల్ల ఆటో వర్కర్స్ ఉపాధి కోల్పోయి దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ పథకం అమలు చేయవద్దని ఏ పార్టీ ఇలాంటి పథకాలు హామీలుగా ఇవ్వవద్దని కోరారు. జిల్లా వ్యాప్తంగా కొవ్వూరు, అనపర్తి, గోకవరం,రాజానగరం, కడియం మండలాల్లో ఆటోల బంద్ విజయ వంతమైంది.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా మందికి ఆటోల బంద్ సమాచారం తెలియక తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.



రాజమహేంద్రవరంలో మహిళల రక్తదానం



రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే గోరంట్ల

## ఘనంగా నారా లోకేశ్ జన్మదినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవం మంగళవారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ పలు సేవాకార్యక్రమాలు చేశారు.. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. టీడీపీ నాయకులు లోకేశ్ జన్మదినోత్సవం పండుగలా చేశారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో మద్దిపాటి వెంకట రాజు ఆధ్వర్యంలో 90 మంది టీడీపీ నాయకులు రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం దానవాయిపేట గానుగ వీధిలోని సంజీవిని బ్లడ్ బ్యాంక్‌లో 150 మంది మహిళలు రక్తదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ భవిష్యత్తు నాయకుడు నారా లోకేశ్ అన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు వలే లోకేశ్ కూడా మంచి విజన్ ఉన్న నాయకుడని అన్నారు. యువగళంతో తానేంటో నిరూపించుకున్నారని చెప్పారు. ఉర్లంకల లోకేష్ ఆధ్వర్యంలో 37వడివిజన్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, కప్పల వెలుగుకుమారి, ఉప్పులూరి జానకీ రామయ్యద్వారా పార్వతీ సుందరి, మీసాల నాగమణి, గొర్రెల సత్యరమణి, కూరాకుల తులసీ, కానేటి కృపామణి, సింహా నాగమణి, కోన సత్య, కర్ణం లక్ష్మీ, మోతా నాగలక్ష్మి, బర్ల గిజ, దొంగ నాగమణి, కె శ్యామల, బండారు సత్తిబాబు, లోలుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుంచి నిజం గెలవాలి

5



రొక్కల రాణి కుటుంబీకులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

## నాపై ఇప్పటి వరకూ 37 కేసులు..

### టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జనవరి 23: ఎన్నికలు పూర్తవడానికి ఇంకా 80 రోజులు ఉందని ఈ ఎనభై రోజుల్లో ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేసేది లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బిక్కవోలు పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఇస్తున్న జీవోలపై ప్రజలను చైతన్యం తెస్తామన్నారు. ఆ జీవో ప్రతులను, ఆ లోగోలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేయమని టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారన్నారు.ఈ మేరకు రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లో 28 మంది టీడీపీ నాయకులు, నాపై రెండు చోట్లా ఎఫ్‌ఐఆర్‌లు వేసి మంగళవారం నోటీసులు అందజేశారన్నారు. అనపర్తి పోలీసులు, జిల్లా ఎస్పీని ప్రశ్నిస్తున్నా.. భోగి మంటల్లో జీవో ప్రతులను, లోగోలను వేస్తే ఆగమేఘాల మీద మా మీద కేసులు నమోదు చేశారని అయితే ఏడాదిన్నర కిందట అనపర్తిలో అప్పటి ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సూచనలు ఇస్తూ చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేయిస్తే ఇంత వరకూ కేసులు లేవన్నారు.ఎందుకీ వివక్ష అని పోలీసులను ప్రశ్నిస్తున్నానన్నారు. ఇప్పటికే ఈ కేసులతో కలిపి నాపై 37 కేసులు నమోదు చేశారని అయినా ప్రజల తరపున పోరాటం చేయడం జరుగుతుందన్నారు.

### రేపు బిక్కవోలుకు భువనేశ్వరి రాక

బిక్కవోలు, జనవరి 23 : నారా భువనేశ్వరి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. "నిజం గెలవాలి" కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అరెస్టు టీవీలో చూసి తట్టుకోలేక గుండెపోటుతో మృతిచెందిన బిక్కవోలుకు చెందిన రొక్కల రాణి కుటుంబీకులను చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించనున్నారు. ఈ నెల 25న మండపేటలో పర్యటనను ముగించుకుని రాత్రికి బలభద్రపురం ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో బస చేస్తారన్నారు. 26 ఉదయం బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం రొక్కల రాణి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి సంఘీభావం ప్రకటిస్తారన్నారు.

## దళిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై దాడి



**దళితులపై దాడులు పెరుగుతున్నాయి.. తాజాగా రాజమహేంద్రవరంలో ఒక ఘటన జరిగింది.. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.. రాజమహేంద్రవరానికి చెందిన కప్పల రజనీదేవి, ధనరాజు భార్యభర్తలు.. ఇద్దరూ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గా పనిచేస్తున్నారు. ఈ నెల 21వ తేదీన ఒక వ్యక్తి డివైడర్‌పై చెత్త వేస్తుండడంతో అడ్డుకున్నారు. దీంతో అతను ఇరువురిపై దాడికి దిగాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది..** - 12లో



కొవ్వూరులో రోడ్డుపై కూర్చున్న అంగన్‌వాడీలు

## గెలిచారా.. ఓడారా!?

### అంగన్‌వాడీలకు మళ్లీ హామీలతోనే సరి!

- నీరుగారిన ఉద్యమం
- బెదిరించిన ప్రభుత్వం
- దిగొచ్చిన అంగన్‌వాడీలు
- నెరవేరని డిమాండ్లు
- చర్చలు సఫలమని ప్రకటన
- 42 రోజుల సమ్మె విరమణ
- విధులకు హాజరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పోరాడి ఓడారా.. ఓడి గెలిచారా.. వారికే ఎరుక.. కేవలం గత ఎన్నికల ముందు జగన్ స్వయంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఏకంగా 42 రోజుల పాటు ఏకధాటిగా సాగిన అంగన్వాడీ ఉద్యమం వైసీపీ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించింది. జిల్లా వ్యాప్తంగా 1556 అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేసి 1538 టీచర్లు, ఆయాలు 1493 మంది (టీచర్లు, ఆయాలు) అంగన్వాడీలు ఒక్కమాటపై నిలబడి పోరాడారు.. డిమాండ్లను సాధించే వరకూ మెట్టు దిగేదిలేదని భీష్మించారు. ప్రభుత్వం భయపెట్టినా భయపడ లేదు.. వారి తెగింపును చూసి అంతా ఆశ్చర్యపోయారు. డిమాండ్లు సాధిస్తారని అనుకున్నారంతా అయితే పూర్తి తమ డిమాండ్లను పరిష్కరించుకోలేకపోయారు. అయితే ప్రభుత్వం మాత్రం మరింత వ్యతిరేకతను మూటగట్టుకుంది.

### గత నెల 12 నుంచి సమ్మె

అంగన్‌వాడీల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం దిగిరాకపోవడంతో సోమవారం తాడేపల్లిలో సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు.ఈ మేరకు బయలుదేరిన మహిళలను దారుణంగా అణచివేస్తూ అదుపులోనికి తీసుకుని మహిళలని కూడా చూడకుండా వేర్వేరు ప్రాంతాలకు తిప్పుతూ సోమవారం సాయంత్రం వరకూ ఇబ్బందులు పెట్టింది.అయితే ప్రభుత్వం అదే సమయంలో చర్చలకు నాయకులను పిలిచి మాట్లాడింది. చివరకు సరైన రాతపూర్వక హామీలు ఇవ్వకుండానే సమ్మె విరమిస్తున్నట్టు సమ్మెకు మద్దతుగా ఉన్న వివిధ సంఘాల నేతలు ప్రకటించారు. దీంతో మంగళవారం అందరూ విధులకు హాజరయ్యారు.ప్రతిపక్షనేత హోదాలో నాడు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిసెంబర్ 12 నుంచి అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు ఉపక్రమించారు.కానీ మొదట్లో సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రత్యామ్నాయంగా సచివాలయ ఉద్యోగులకు అంగన్వాడీ బాధ్యతలు అప్పగించింది. ఏకంగా అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలుకొట్టి చాలా కేంద్రాలు తెరిపించింది. కానీ ఎక్కడా పూర్తిస్థాయిలో పిల్లలకు, బాలింతలకు,గర్భిణులకు చేరవలసిన సరుకులు పూర్తిస్థాయిలో చేరలేదు. కానీ అంగన్వాడీలంటే ఏంటనేది ప్రజలందరికీ అర్థమైంది. ప్రభుత్వం మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా చాలా ఇబ్బందులు పెట్టింది. ఎస్మా చట్టం ప్రయోగించింది. చివరకు నోటీసులు ఇచ్చింది. ఉద్యోగాలు తీసేస్తామని ప్రత్యామ్నాయంగా కొత్తవారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామని చిన్న ఉద్యోగులను తీవ్ర స్థాయిలో భయపెట్టింది. అయినా లొంగలేదు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి ఛలో విజయవాడ పేరుతో వేలాది మంది తరలివెళ్లారు. ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. దొరికినవారిని దొరికినట్టు పట్టుకుని బస్సులు ఎక్కించి, వేరే ప్రాంతాలకు తరలించి ఇబ్బందులకు గురిచేశారు. అయినా ప్రభుత్వం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ప్రధాన డిమాండ్ అయిన జీతం పెంపును జూలై నుంచి అమలు చేస్తామని ప్రకటించడంతో ఉద్యమ నేతలు సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు. సమ్మె విజయవంత మైనట్టు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీ యూ సంఘాలు ప్రకటించాయి.

### హామీలు అమలయ్యేనా..?

మళ్లీ హామీలకా ఇన్ని రోజులు సమ్మె చేసిందని పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే 42 రోజుల సమ్మె కారణంగా సాధించిందేమిటంటే తిరిగి హామీలే. జూలైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం అంగీకరించింది. గ్రాట్యుటీ విషయాన్ని కేంద్రానికి సిఫారసు చేస్తామని, ఉద్యోగ విరమణ సమయంలో ఇచ్చే ప్రయోజనాలను వర్కర్లకు రూ.50 వేల నుంచి లక్షా 20 వేలకు పెంచడానికి అంగీకరించింది. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తామని ప్రకటించింది. సర్వీసులో చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్టు నేతలు ప్రకటించారు. వైఎస్‌ఆర్ బీమా అమలు చేస్తామని, మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇస్తామని, హెల్పర్ల ప్రమోషన్ వయస్సు 45 నుంచి 50 ఏళ్లకు పెంచుతామని హామీ ఇచ్చినట్టు నేతలు చెబుతున్నారు. ఇవన్నీ అమలు చేయవలసిన ప్రభుత్వం మళ్లీ కేవలం హామీలివ్వడం గమనార్హం. కానీ సమ్మె విజయవంత మైందని, విజయవాడ నుంచి జిల్లాకు రైలులో వచ్చిన నాయకులకు మహిళలు స్వాగతం పలికి, సంబరాలు చేసుకోవడం గమనార్హం.

### అంగన్వాడీ వ్యవస్థ ఛిన్నాభిన్నం

అంగన్‌వాడీలు చేసిన 42 రోజుల సమ్మె వల్ల ప్రభుత్వానికి సరుకులు మిగిలినట్టు అయింది. చాలా కేంద్రాలను కేవలం రెండు మూడు గంటలు తెరచి వచ్చినవారికి అన్నంపెట్టి పంపేశారు. మొదట్లో సరఫరా చేసిన సరుకులనే పంపిణీ చేశారు. రెండో దఫా సరుకులు రాలేదు. ఉద్యమ సమయంలో అంగన్వాడీల నిర్వహణ లోపాలు బయటపడ్డాయి. మంగళవారం జిల్లాలో మొత్తం అన్ని కేంద్రాల్లోనూ వర్కర్లు, హెల్పర్లు బాధ్యతలు స్వీకరించారని అన్ని కేంద్రాలు నడుస్తున్నాయని ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మితెలిపారు.



### అంగన్‌వాడీల క్యూ

సుమారు 44 రోజుల తర్వాత అంగన్‌వాడీలు విధులకు క్యూకట్టారు. సోమవారం ఉదయం నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు జాయి నింగ్ లెటర్‌పై తేదీ, సమయం, వేసి రాత పూర్వకమైన లెటర్లను సూపర్‌వైజర్లకు అంద జేసి విధులకు హాజరవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సోమవారం ఉద యం నుంచే అంగన్‌వాడీలు క్యూకట్టారు. చర్చలు ఫలించినట్టు ప్రకటించడంతో మం గళవారం అంతా లెటర్లు పట్టుకుని యధావిధిగా విధులకు వచ్చేశారు. - **గోపాలపురం**

### ఎన్నికల ముంగిట అమలెలా?

ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఐదేళ్ల కిందట జగన్ ఇచ్చిన హామీలకే సీఎం అయిన తరువాత కూడా దిక్కులేదు.. ప్రస్తుతం ఎన్నిక ఏడాది.. వచ్చే నెలలో మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది.. మళ్లీ హామీలే తెచ్చుకుని ఎలా విజయం సాధించామని చెప్పుకుంటున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.. కనీసం 10వ తరగతి చదువుకోని చాలా మంది అంగన్‌వాడీలు మాత్రం నాయకులు విజయం సాధించామంటే తాము విజయం సాధించామని ఆనంద పడుతున్నారు. అయితే మేధావులు మాత్రం అంగన్‌వాడీలను అణచివేసి ప్రభుత్వం విజయం సాధించిందని చెబుతున్నారు. ఎందుకంటే జూలై నెలలో వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వడంలోనే అసలు మెలిక ఉందనేది చాలా మంది వాదన.



ప్రభుత్వాసుపత్రిలో కేంద్ర సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాఘెల్

## కేంద్రం ఇచ్చిన నిధులకు తగినట్టు సదుపాయాల్లేవ్

- నిధులు కేంద్రానివి.. ప్రచారం వైసీపీది
- జిల్లా ఆసుపత్రిలో 2 గంటల పాటు పరిశీలన
- కేంద్ర సహాయ మంత్రి బాఘెల్

రాజమహేంద్రవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. వేల కోట్ల రూపాయలతో ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన సదుపాయాలను కల్పిస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాఘెల్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. సుమారు రెండు గంటల పాటు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి విభాగాల పనితీరును వివరించారు. ముందుగా మంత్రి మొక్కలను నాటిన అనంతరం ఓపీ రిజిస్ట్రేషన్ల గదిని పరిశీలించారు. కేంద్రం ఇచ్చే నిధులకు తగినట్టుగా ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పన జరుగుతున్నట్టు కనిపించడం లేదన్నారు. 70శాతం నిధులు కేంద్రమే భరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఫ్లెక్సీలతో ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీలో అందిస్తున్న చికిత్సలకు గరిష్ఠ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిందని అధికారులు వివరించగా.. పెంచడం ముఖ్యం కాదని ఎంత మంది లబ్ధిపొందుతున్నారని ప్రశ్నించారు.పలు విభాగాలను పరిశీలించిన అనంతరం ఆస్పత్రి అధికారులతో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యం, సదుపాయాల గురించి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభ మంత్రికి వివరించారు. క్యాన్సర్‌కి కేంద్రానికి మంజూరు చేసిన నిధులకు సమకూర్చిన సదుపాయాలకు పొంతన కుదరడం లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రాధాన్యం గురించి వివరించారు. జన ఔషధి ఫార్మసీల గురించి ఆరా తీసిన ఆయన ఇంకా అవసరమైన వాటికి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. మంత్రి ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు పక్కదారి పడుతున్నాయా? కేంద్ర ఉద్దేశం నెరవేరే విధంగా పనులు ఉన్నాయా? అనే అంశాలపైనే దృష్టి సారించారు. ఆయన ప్రభుత్వాస్పత్రిలో దాదాపు రెండు గంటలపాటు చేసి పరిశీలన కూడా ఆ దిశగానే సాగింది. ఎక్కడా రోగులతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు.ఆయన వెంట ఆర్‌ఎంవోలు డాక్టర్ నజీరుద్దీన్,డాక్టర్ ప్రణవ్, వైద్యులు డాక్టర్ హేమంతి, డాక్టర్ సునీత, డాక్టర్ విజయబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.ప్రియాంక, మెడికల్ ఇంజనీరింగ్ అధికారులు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, రేలంగి శ్రీదేవి ఉన్నారు.

### మరో ఐదేళ్ల పాటు ఉచిత బియ్యం

నిడదవోలు, జనవరి 23: అర్హులైన పేదలకు ఒక్కొక్కరికి ఐదేసి కిలోల చొప్పున మరో ఐదేళ్లపాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తామని కేంద్ర సహాయ మంత్రి బాఘెల్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మంగళవారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉచిత బియ్యం పంపిణీ సుమారు 80 కోట్ల మందికి కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు అమలు కానుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. తాజాగా ఉజ్వల పథకం ద్వారా దేశంలో సుమారు 11 కోట్ల మంది మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. పేదలకు బియ్యం, గోధుమలు ఉచితంగా ఇవ్వడానికి ప్రధాని మోదీ జేబులో డబ్బులు ఖర్చు చేస్తున్నారా? అంటూ రాష్ట్ర పాలకులు విమర్శిస్తున్నారని.. ఆ డబ్బులు వైసీపీ ప్రభుత్వం భరిస్తోందా అని ప్రశ్నించారు.పేదలను ఆదుకునే బాధ్యత కేంద్రంపై ఉంటుందన్నారు.

## వృద్ధులను అగౌరవపరచినా.. వేధించినా నేరమే

### సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత వారి పిల్లలపై ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో వయోవృద్ధుల సంక్షేమంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల పట్ల వారి పిల్లలు అగౌరవంగా వ్యవహరించినా, వేధింపులకు గురిచేసినా చట్ట రీత్యా నేరమన్నారు. వయోవృద్ధుల పోషణను నిర్లక్ష్యం చేసిన పక్షంలో మెయింటెనెన్స్ కోసం ఆర్డీవో ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేయవచ్చన్నారు. న్యాయ స్థానంలో కూడా సీఆర్పీసీ సెక్షన్ 125 ప్రకారం పిటిషన్ వేసుకోవచ్చని సూచించారు. వయోవృద్ధులకు ఎలాంటి న్యాయ సమస్యలు ఉన్నా ఉచిత సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. వయోవృద్ధుల హక్కులపై ఉన్న చట్టాలు, నల్సావారి వయోవృద్ధులకు న్యాయ సేవల పథకం-2016, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 గురించి విశదీకరించారు. కార్యక్రమంలో ఐటీఎస్ జీఎం పలివెల రాజు, డీజీఎం జీవీ మనోజ్ కుమార్, పారా లీగల్ వలంటీరు జీఎస్‌వీఎస్‌ఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

# నేటి నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమం

**చంద్రబాబు అరెస్టు సమయంలో చనిపోయిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి పరామర్శ**

**ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల పర్యటన**



కాకినాడ సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టుతో వేదనకు గురై కొంతమంది మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించేందుకు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి..' కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై అశువులు బాసిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సాయం అందించనున్నారు.

**మూడురోజుల పాటు పర్యటన**

24న కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం, 25న అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం, 26న రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో పర్య టించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 11.30 గంటలకు భువనేశ్వరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి 12.30 గంటలకు జగ్గంపేట మండలం గుర్రపాలెం, 1.25 గంటలకు పెద్దాపురం మండలం కాండ్రకోట, సాయంత్రం 4.05 గంటలకు తుని రూరల్ మండలం తేటగుంట, 5.20 గంటలకు కాకినాడలోని 26వ డివిజన్‌లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. రాత్రికి ముమ్మిడివరం నియోజకవర్గం మహిపాల చెరువువద్ద జాతీయ రహదారి పక్కన గ్రాండ్ పార్క్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు. 25న గురువారం ఉదయం 10.30 గంటలకు పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం, 11.45 గంటలకు అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, 12.25 గంటలకు అల్లవరం మండలం రెల్లుగడ్డ, 2.40 గంటలకు రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం, సాయంత్రం 5.25 గంటలకు మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం నల్లూరు, 6.20 గంటలకు మండపేట మండలం పాలతోడు గ్రామంలో పర్యటిస్తారు. రాత్రికి అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం చేరుకుని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు. 26న శుక్రవారం ఉదయం 10.25గంటలకు బిక్కవోలు, 12.40 గంటలకు నిడదవోలు మండలం పందలపర్రు, 1.20 గంటలకు తిమ్మరాజుపాలెం, 1.55 గంటలకు తాడిమళ్ల, 3.15 గంటలకు గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి ఆమె హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

## మహిళా వాలీబాల్ పోటీల విజేత
# సౌత్ సెంట్రల్ రైల్వే



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మలికిపురం, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెంలో నాలుగు రోజులు పాటు జరిగిన జాతీయ మహిళా వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం అర్థరాత్రి ముగిసింది. సౌత్ సెంట్రల్ రైల్వే టీమ్ విజేత కాగా ఐసీఎఫ్ టీమ్ ద్వితీయ స్థానంలో, కేరళ పోలీసు టీమ్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎస్పీ ఎస్.శ్రీధర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జాతీయ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించిన ఏసీఎఫ్ ఫౌండేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చైర్మన్ అడబాల వేణుగోపాల్, అడబాల బ్రహ్మాజీ, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల తాతకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీ, అల్లూరి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం

**ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ**



చంద్రబాబు సాగర్‌ను పరిశీలిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి23: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు చెందిన సాగునీటి ప్రాజెక్టులు అనేక సమస్యల్లో చిక్కుకుని నిరుపయోగంగా మారాయని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. నియోజకవర్గంలోని ఏలేరు సాగునీటి ప్రధాన జలాశయంతో పాటు సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులను మంగళవారం ఆమె టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ ప్రాజెక్టులు అధ్వాన తీరు పట్ల సత్యప్రభ నాయకత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని కనీస మరమ్మత్తులకు నోచుకోలేదని అన్నారు. చంద్రబాబు సాగర్‌కు రెండు దశాబ్దాలుగా కాలువల ఏర్పాటు జరగలేదన్నారు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు వరదల సమయంలో పడిన గండ్లు పూడ్చలేదని, ఏలేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు నోచుకోలేదని రాజ్యాంగ సమస్యల పరిష్కారం కోసం తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మెట్ట ప్రాంత రైతులకు శాపంగా మారిందని సత్యప్రభ దుయ్యబట్టారు. అనంతరం ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నియోజకవర్గ టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, సూది బూరయ్య, మిరియాల శ్రీను, బొండాడ నారాయణ, బొల్లు వెంకటేశ్వరరావు, రొంగల సత్యనారాయణ, తటవర్తి సుబ్బారావు, లొండా లోవరాజు, సూది ప్రభాకర్, రావూరి తాతాజీ, రామిశెట్టి మున్నిబు తదితరులు పాల్గొన్నారు.

## లవకుశలో నటించడం పూర్వజన్మ సుకృతం



కుశుడు పాత్రధారి(మధ్యలో)

పెద్దాపురం, జనవరి 23 : సంచలనాత్మక పౌరాణిక చిత్రం లవకుశలో కుశుడు పాత్రలో తాను నటించడం తన పూర్వ జన్మ సుకృతమని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని ప్రముఖ న్యాయవాది చిటికిన కనకదుర్గారావు ఇంటికి వచ్చిన నాగసుబ్రహ్మణ్యం పాత్రికేయులతో మాట్లాడారు. లవకుశ సినిమాలో నటించిన వారందరూ మరణించగా తాను మాత్రమే జీవించి ఉన్నానన్నారు. తన సోదర పాత్రధారి అయిన నాగరాజు లవుడు పాత్రలో తనతో గట్టిగా పోటీపడ్డారన్నారు. ఆయన కూడా మరణించడం తనకు ఎక్కువ బాధను కలిగించిందన్నారు. లవకుశ సినిమా తర్వాత సీతా రామ కల్యాణం, వెలుగునీడలు, శ్రీవెంకటేశ్వర మహత్యము సినిమాలలో నటించిన తర్వాత వెండితెరకు దూరమయ్యానన్నారు. బతుకుదెరువు కోసం బుర్రకథలు చెప్పడం ప్రారంభించి సుమారు పది వేల బుర్రకథలు చెప్పి నాజర్ తర్వాత ద్వితీయ రికార్డును సాధించానన్నారు. ఒక దశలో తాను మరణించానని సామాజిక మాధ్యమాలలో ప్రసారం జరిగిందని ఆ దశలో లవకుశలమైన నాగరాజు తాను పత్రికల ద్వారా తిరిగి వెలుగులోకి వచ్చి అనేక సన్మానాలు పొందామన్నారు. పుట్టా సోమన్నచౌదరి, చిట్టెం హరిగోపాలశర్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నర్సరీని సందర్శించిన అంజనాసిన్హా



మొక్కలను పరిశీలిస్తున్న అంజనాసిన్హా

కడియం, జనవరి 23: కడియపులంక పుల్లా ఆంజనేయులు(అబ్బులు)-సత్యదేవా నర్సరీని మంగళవారం జాతీయ రహదారుల సంస్థ డీజీ అంజనాసిన్హా సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా అబ్బులు 'జామియా' అనే మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా నర్సరీలోని పలు మొక్కలు, వాటి శాస్త్రీయ నామాలు, పెరిగే తీరు, పెంపకం వంటి విషయాలను అబ్బులు కుమారుడు వీరబాబు వివరించారు. కాగా రహదారుల పరిస్థితి బాగా లేదని, మొక్కల రవాణా జరిగే ఈ ప్రాంతంలో రోడ్లు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అంజనాసిన్హా దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతామని ఆమె తెలిపారు.



## నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

పెద్దాపురం, జనవరి 23: మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ నాటిక పోటీలను జడ్పీ సీఈవో అబ్బిరెడ్డి రమణారెడ్డి ప్రారంభిస్తారని, అలాగే ముఖ్య అతిథిగా డీఎస్పీ లతాకుమారి హాజరవుతారన్నారు.. ఈ నాటిక పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# చంద్రబాబు భరోసాతో..

**గిరిజన యువతలో చిగురిస్తున్న ఆశలు!**

**గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు**

**గిరిజనులకేనన్న బాబు**

**జీవో 3 పునరుద్ధరణకు అరకు సభలో హామీ**

(రంపచోడవరం): జగన్ ప్రభుత్వ తీరుతో నైరాశ్యంలో ఉన్న గిరిజన యువతకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన ఉద్యోగ భరోసాను కల్పించి కొత్త ఆశలను చిగురింపజేసింది. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించిన 'రా కదలి రా' కార్యక్రమంలో జీవో నంబరు 3 పునరుద్ధరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ఉద్యోగాలూ గిరిజనులకే దక్కేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం దివంగత ఎన్టీరామారావు సారథ్యంలో 1986లోనే నడుం బిగించింది. అన్ని ఉపాధ్యాయ పోస్టులూ గిరిజనులతోనే భర్తీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పలు కేసులు నడిచాయి. తెలుగుదేశం ప్రభుత్వం కూడా అంతే దీటుగా గిరిజనులకు అండగా నిలిచి సుప్రీంకోర్టు వరకూ పోరాడింది. రాజ్యాంగపరంగా గిరిజనులకు అండగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో అన్ని ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకే దక్కే విధంగా జీవో నెం.3ను తీసుకొచ్చి, 1986 నుంచి వర్తించేలా గిరిజన యువతకు రక్షణ కల్పించింది. ఇదే పరంపరను క్రమేణా అన్ని పోస్టులకు వర్తింపచేస్తూ వచ్చారు. అనేక నియామకాలు ఆ జీవో పరిధిలోనే చేపడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచుతూ వచ్చారు. ఆ జీవోపై కూడా పలు కేసులు దాఖలయ్యాయి. మూడు దశాబ్దాల కాలంగా గిరిజన యువత ఉద్యోగాలకు భరోసాగా నిలిచిన ఆ జీవోపై చేబ్రోలు లీలా ప్రసాదరావు కేసులో ప్రభుత్వ వైఫల్య వాదనల కారణంగా చివరకు 2020 ఏప్రిల్‌లో ఆ జీవో సుప్రీంకోర్టులో వీగిపోయింది. ఆ తీర్పుతో గిరిజన యువతకు గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగ భరోసా ప్రశ్నార్థకమైంది. జనాభా ప్రాతిపదికన కేవలం 6నుంచి 7శాతం మాత్రమే గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకు దక్కే దుస్థితి కలిగింది. గిరిజనులకు అండగా నిలవాల్సిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను పునరుద్ధరించే దిశగా సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితుల్లో విద్యావంతులైన గిరిజన యువత ప్రభుత్వ నియామకాలు పొందలేని స్థితిలో మైదాన ప్రాంతాలకు వలసపోతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా లేక గిరిజన యువత దిక్కుతోచని స్థితిలో కుంగిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం అరకులోయకు వచ్చిన చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించి తమ ప్రభుత్వం గిరిజన యువతకు నూరుశాతం ఉద్యోగ భరోసా కల్పిస్తూ ఇచ్చిన జీవోను జగన్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని, తద్వారా గిరిజన యువత భవిష్యత్‌ను దెబ్బతీసిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో 3 పునరుద్ధరణకు అవసరమైన చట్టపరమైన చర్యలన్నిటినీ తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో గిరిజన యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాగా, జీవో 3 పునరుద్ధరణ హామీ ద్వారా గిరిజన యువతకు తమ పార్టీ భరోసా కల్పిస్తోందని, భవిష్యత్‌కు గ్యారంటీ విధానంలోనే గిరిజన యువతకు చంద్రబాబు అండగా నిలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేశ్, వంతల రాజేశ్వరి తెలిపారు.

# గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి

**ప్రభుత్వం, పోలీసుల బెదిరింపులే కారణమంటున్న సంఘం నేతలు**



శేషారత్నం



నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

మండపేట, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో అంగన్వాడీ వర్కర్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.... కేశవరానికి చెందిన అంగన్వాడీ వర్కర్ చంద్రమళ్ల శేషారత్నం (50) సోమవారం 'చలో విజయవాడ'కు బయల్దేరింది. ఆ సమయంలో ఆమెతో పాటు పలువురు అంగన్వాడీలను మండపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఇప్పనపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం విడిచిపెట్టారు. సమ్మె చేస్తున్న వారిపై ఆంక్షలు విధించడం, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం, పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు నాన్‌బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని బెదిరించడంతోనే శేషారత్నం ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందిందని సహచర అంగన్వాడీలు చెబుతున్నారు. శేషారత్నం మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. శేషారత్నం మరణ వార్త తెలిసిన వెంటనే సీఐటీయూ, అంగన్వాడీ నాయకులు ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యేనని అంగన్వాడీలు ఆరోపించారు. శేషారత్నం కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొని ఆందోళనకు గురై రాష్ట్రంలో మరణించిన అంగన్వాడీల కుటుంబాలకు న్యాయం చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కాకినాడ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసుల వేధింపుల కారణంగానే శేషారత్నం మృతి చెందిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి ఆరోపించారు. శేషారత్నం మృతి పట్ల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బేబి, పద్మ, ఎంపీపీ ఉండమట్ల వాసు, దూలం వెంకన్నబాబు, ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి సంతాపం తెలిపారు.

# ఉత్కంఠగా లాన్ టెన్నిస్ పోటీలు



హోరాహోరీగా టెన్నిస్ పోటీ జరుగుతున్న దృశ్యం

కాకినాడ రూరల్, జనవరి 23: 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు 4వ రోజు మంగళవారం ఉత్కంఠగా కొనసాగాయి. 19 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈపోటీలు బుధవారం ముగియనున్నాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలోగల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. మొత్తం 18 మ్యాచ్‌లు నిర్వహించగా సెమీఫైనల్ మ్యాచ్‌లో రిషివర్ధన్ (కర్ణాటక)పై వహీన్‌పటేల్(గుజరాత్) 7-5 స్కోర్‌తో విజయం సాధించాడు. అర్జున్‌రాఠీ(హర్యానా) జాన్‌రోహన్(తమిళనాడు)పై 6-4 స్కోర్ తేడాతోనూ, తెలంగాణకు చెందిన శాండిల్య, అవాంపారిక్(గుజరాత్‌పై)7-5 స్కోర్‌తోనూ గెలుపొందారు. మొదటి సెమీఫైనల్‌లో తెలంగాణకు చెందిన ధీరజ్ గెలుపొందగా అర్జున్‌రాఠీ (హర్యానా), ధీరజ్ (తెలంగాణ) మధ్య బుధవారం ఫైనల్‌మ్యాచ్ జరగనుంది, ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన లాన్‌టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్ కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి, శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు, హుస్సేన్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

## ఆ మూడు డిగ్రీ కోర్సులు ఏఐసీటీఈ పరిధిలోకి రాకుండా చూడాలి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దివాన్‌చెరువు, జనవరి 23: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీహెచ్ఎం కోర్సులను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు తీర్మానం చేశారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, విశ్వవిద్యాలయాలు తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోతాయన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ చొరవ తీసుకుని సదరు మూడు డిగ్రీ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్లకుండా చూడాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి పద్మరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడు గంధం నారాయణరావు, నన్నయ వర్సిటీ ఎఫిలియేటెడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, అధ్యక్షుడు కేవీఆర్ఎస్ నరసింహారావు, మల్లిడి అనంతరెడ్డి, బర్ల సత్యనారాయణ, సాంబశివరావు, గంగిరెడ్డి, గణేష్ చౌదరి వివిధ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

**నేడు వర్క్‌షాపు**

నన్నయ యూనివర్సిటీలో సామాజిక ఇంజనీరింగ్ యాక్సెస్, చేరిక యువ సాధికారికత ఉపాధి అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు వీసీ కె.పద్మరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ వర్క్‌షాపునకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల అధ్యాపకులతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు హాజరు కావాలని కోరారు. వర్క్‌షాపు కన్వీనర్‌గా ఆచార్య కె.శ్రీరమేష్, కోకన్వీనర్‌గా పి.ఉమామహేశ్వరిదేవి వ్యవహరిస్తారని తెలిపారు. వర్క్‌షాపుకు హాజరైన వారికి ఈ-సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

## గంజాయితో ముగ్గురి అరెస్టు

వై.రామవరం, జనవరి 23: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆదేశాలతో వై.రామవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. గంజాయి తరలిస్తున్న వారిలో ఒకరు మైనర్ కాగా మిగిలిన ఇద్దరు కాకినాడకు చెందిన ద్రాక్షారపు ఉమాశంకర్, వై.రామవరం మండలం పాతకోట పంచాయతీ రాచమెట్టకు చెందిన కొర్ర ఆనందరాజులుగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. ఒడిసా నుంచి యార్లగడ్డ మీదుగా గంజాయిని తరలిస్తున్నారని రూ.66 వేలు విలువచేసే 22 కిలోల గంజాయిని, పల్సర్‌బైక్‌ను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నలుగురు వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంతల

ఎటపాక, జనవరి 23: ఎటపాక మండలం, పురుషోత్తపట్నం పంచాయతీలోని వైసీపీకి చెందిన నలుగురు వార్డు మెంబర్లతో పాటు గ్రామానికి చెందిన న్యాయవాది, పలు కుటుంబాలకు చెందిన వారు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు జెండా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడారు. మరో మూడు నెలలో వైసీపీ పాలన ముగుస్తుందని, రానున్నది చంద్రబాబు స్వర్ణయుగమని చెప్పారు. ఆరు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని అన్నారు. అంతకు ముందు ఆమె పురుషోత్తపట్నంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సున్నం వెంకటరమణ, మాచినేని రాజేష్, పాటి చలపతి, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు కేంద్రం చేయూత

**కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భాగెల్**



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ భాగెల్

నిడదవోలు, జనవరి 23: కేంద్రం రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలకు నిధులు అందించి చేయూతనందించిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భాగెల్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాల్లో వంద శాతం నిధులతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఒకప్పుడు గ్యాస్ కనెక్షన్ కోసం నెలలు తరబడి వేచి ఉండేవారని ఇప్పుడు అడిగిన వెంటనే గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామన్నారు. దేశంలో స్వచ్ఛ భారత్ ద్వారా పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పేదలు అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, మండలాధ్యక్షుడు మాట్ల వెంకటదుర్గారావు, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, రేలంగి శ్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన రైతుకు సత్కారం



గిరిజన రైతును సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జనవరి 23: టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి సత్కరించినట్లు కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త జి.రామానందం తెలిపారు. గుజరాత్‌లోని నవసారి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం 11వ సదస్సు జరుగుతుందన్నారు. ఈ పథకంలో 2022-23లో నిర్వహించిన పరిశోధనా ఫలితాలపై సమీక్షించి చేపట్టవలసిన కార్యాచరణపై మంగళవారం ఆయన పరిశోధన కేంద్రంలో దిశ నిర్దేశం చేశారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద గిరిజన రైతుల్లో శాస్త్రీయ సాగు విధానంలో ప్రోత్సాహానికి ఆర్థిక సహాయం, నాణ్యమైన మొక్కలు, పోషకాలు, పురుగుల మందులు, సూక్ష్మ పోషకాలు, స్ప్రేయర్స్ అందిస్తోంది. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం లంకలపల్లికి చెందిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజు టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి రూ.4.5 లక్షల నికర ఆదాయాన్ని పొందారు. దీంతో కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి నవసారి వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి జేబీ సబేల్, ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ వీబీ పాటిల్, వైఎస్ఆర్‌హెచ్‌యూ రిటైర్డ్ ఉపకులపతి బీఎంసీ రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్ సత్కరించారు. కన్నప్పరాజును ప్రోత్సహించిన కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను అభినందించారు.



అయోధ్యలో రామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న యశోద ఆస్పత్రి చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామిరెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి...

# తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

## ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

రంగంపేట, జనవరి 23: ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని, ఓటు దేశ చరిత్రనే మార్చేస్తుందని రంగంపేట జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం వరలక్ష్మి అన్నారు. మంగళవారం ఓటుహక్కు వినియోగంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి తారతమ్యం లేకుండా దేశంలో 18ఏళ్లు నిండిన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు కల్పించిదని, దానిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

## ఏజెన్సీ సమాచారం

## పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘీభావ సదస్సును జయప్రదం చేయాలి

రంపచోడవరం, జనవరి 23: ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జరిగే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘీభావ సదస్సును విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షుడు ఇల్లా రామిరెడ్డి చెప్పారు. కార్యక్రమానికి మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రూన్సీ, ఆదివాసీ లీగల్ సెల్ కన్వీనర్ పల్లా త్రినాథ్‌రావు, ఆదివాసీ మహాసభ నాయకులు ఐనాపురపు సూర్యనారాయణ హాజరవుతారన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురయ్యే 373 గ్రామాలకు సమగ్ర పునరావాసం, కొండమొదలు పెద్దలతో జరిగిన ఎంవోయూ అమలు, ఆదివాసీల సాగులో ఉన్న డి.పట్టా భూములకు నష్టపరిహారం, 500 ఓటర్లు పైబడిన పునరావాస కాలనీలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని కోరుతూ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు.

## వ్యాధి నిరోధక టీకాల వినియోగంపై శిక్షణ



మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ మోహన్

రంపచోడవరం, జనవరి 23: గర్భిణీలు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులకు సంబంధించిన సేవలు (కిల్కారి)పై మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, నోడల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ మోహన్ మాట్లాడుతూ కిల్కారి ప్రోగ్రాం ద్వారా లబ్ధిదారులకు మొబైల్ కాల్స్ ద్వారా గుర్తు చేస్తూ సేవలను అందించనున్నట్లు చెప్పారు. ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, హెచ్ఈవో కె.పీటర్, హెచ్ఈ రూన్సీ పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన అంగన్వాడీలు

రాజవొమ్మంగి, జనవరి 23: 42 రోజుల పాటు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరవధిక సమ్మెకు దిగిన అంగన్వాడీలు మంగళవారం తమ విధులకు హాజరయ్యారు. రాజవొమ్మంగి మండలంలోని అంగన్వాడీలు మంగళవారం సాయంత్రం భారీ ర్యాలీగా ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లి తమ విధుల్లో చేరుతున్నట్లు పత్రాలు సీడీపీవో దేవమణికి సమర్పించారు.

## ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రంపచోడవరం, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలి ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు.

### పురుషోత్తపట్నంలో వేడుకలు

ఎటపాక, జనవరి23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పురుషోత్తపట్నంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను నాయకులు, కార్యకర్తల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు, అరకు పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, పంచాక్షరయ్య, పోటు రంగారావు, నలజాల మధు పాల్గొన్నారు.

### చింతూరులో...

చింతూరు, జనవరి 24 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం చింతూరులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, నాయకులు వెంకటేశ్వరరావు, నూకాచారి, నరసింహారావు, సురేష్‌కుమార్, శీలం తమ్మయ్య, సాల్మన్‌రాజు, పొదిలి రామారావు, ఫాతిమా బేగం, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో లోకేశ్ జన్మదిన వేడుక

## ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ



బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న సునీత

రంపచోడవరం, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అనంతమోహన్, మాజీ మండలాధ్యక్షుడు అడబాల బాపిరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు సిద్ద వెంకన్న దొర, బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి వీరబాబు, చక్ర వర్తి, సాదల సత్యవతి, సంకురు పెంటమ్మ, పండా రాజు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో లోకేశ్ జన్మదిన వేడుకలు

రాజవొమ్మంగి జనవరి 23: రాజవొమ్మంగి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. రాజవొమ్మంగి గ్రామంలో జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అలానే అనంతగిరి గ్రామంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మిరియాల శిరీష ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



రాజవొమ్మంగిలో వేడుకలు

# అంతిమ విజయం టీడీపీదే

- లోకేష్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే గోరంట్ల
- పలుచోట్ల తెలుగుదేశం నాయకుల సేవా కార్యక్రమాలు

కడియం, జనవరి 23: వైసీపీ ఎంత ప్రయత్నించినా అంతిమ విజయం టీడీపీదేనని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పలుచోట్ల మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కడియంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ కార్యాలయం వద్ద కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్య అతిథిగా విచ్చేసి కేకు కట్ చేసి లోకేశ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ తన తాత ఎన్టీఆర్‌కు తగ్గ మనుమడని, తండ్రి చంద్రబాబు తగ్గ వారసుడని అన్నారు. కడియం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, మార్గాని సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీను, పితాని శివరామకృష్ణ, జోడపాటి గోపి, వాశంశెట్టి నాగబాబు, వరగోగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం రూరల్:** మండలంలోని బొమ్మూరులో టీడీపీ మండలాధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల విచ్చేశారు. ముందుగా అభయాంజనేయస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో పందూరి అప్పారావు, కామిని భాస్కరరావు, మజ్జి పద్మావతి, ఆళ్ల ఆనందరావు, యర్రమోతు ధర్మరాజు, బొప్పన శ్రీను, యార్లగడ్డ శేఖర్, బత్తిన బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండలో నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు



అనపర్తిలో కేక్ కట్ చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

**బిక్కవోలు:** బిక్కవోలులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేకును కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. నారా లోకేశ్ రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి యువతను ఆకట్టుకుని వైసీపీ నేతలకు నిప్పుగా మారాడన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి వాసు, పి.శివప్రసాద్‌చౌదరి, రాయుడు రామచంద్రరావు, చాగంటి సాయిబాబారెడ్డి, వైదాడి వెంకటేశ్వరరావు, పాటి శ్రీను పాల్గొన్నారు.

**అనపర్తి:** అనపర్తిలోని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్రతో జగన్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారని, పార్టీకి సమరోత్సాహాన్ని నింపిన నాయకుడని అన్నారు. లోకేశ్ జన్మదినం సందర్భంగా ట్విట్టర్‌లో శుభాకాంక్షలు నాలుగో స్థానంలో ఉన్నారని దీనిని బట్టే ఆయన చరిష్మా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

**కోరుకొండ:** కోరుకొండలో టీడీపీ నాయకుడు మాతా ప్రభు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లోకేశ్ చిత్రపటం ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు మాతా సీతారాముడు, ఉప్పలపాటి వీరాస్వామి, కాళ్ల శ్రీరాముడు, రొంగల శ్రీనివాస్, మైరెడ్డి రాంబాబు, గుర్తుత్తి రవిబాబు, దాశెట్టి శ్రీనివాస్, కామిశెట్టి దొరబాబు పాల్గొన్నారు.

# మా పొట్ట కొట్టొద్దు

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- పలుచోట్ల ఆటో డ్రైవర్ల నిరసనలు



రాజానగరంలో బంద్ పాటిస్తున్న ప్యాసింజర్ ఆటోల డ్రైవర్లు

రాజానగరం, జనవరి 23: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి తమ పొట్ట కొట్టొద్దని, సదరు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజానగరంలోని శ్రీలక్ష్మీ గణపతి ప్యాసింజర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం బంద్ పాటించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే దిశగా ప్రభుత్వం యోచిస్తోందని, ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లోని ఆటో డ్రైవర్ల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని ఆవేదన వెలిబుచ్చారు. ఆటో సంఘాల జేఏసీ పిలుపు మేరకు బంద్ పాటించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ మట్ట శ్రీను, పల్లిబోయిన రమణ, మేడిద సత్తిబాబు, కడవలి వెంకటరమణ, లోవ భాస్కర్, నాగదేవర పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

**గోకవరం:** గోకవరంలో ఆటోడ్రైవర్లు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బయలుదేరి పాతబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకొని అధికార, ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మా ట్లాడుతూ ఇప్పటికే తెలంగాణాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి ఆటో కార్మికుల పొట్ట కొట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో అలాంటి పరిస్థితి తీసుకురావద్దన్నారు. తమకు ఉపాధి లేకుండా చేసే నిర్ణయాలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆటోడ్రైవర్లు రెవెన్యూ అధికారులకు అందజేశారు.

**కడియం:** కడియం, వేమగిరిలో ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆటోలు నిలిపి వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

**అనపర్తి:** అనపర్తిలో ఆటో కార్మికులు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గాంధీ బొమ్మ నుంచి దేవీచౌక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి కెనాల్ రోడ్డుపై కొద్ది సేపు నిరసన చేపట్టారు. ఇప్పటికే తమ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే గిరాకీలు ఉండక పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. బంద్ సందర్భంగా ఆటోలను నిలుపుదల చేయడంతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కడియం: వేమగిరిలో నిరసన తెలుపుతున్న ఆటోవర్కర్స్ యూనియన్

# మైనార్టీల్లారా మేల్కోండి

- ముస్లిం కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: మైనార్టీలంతా మేల్కొనాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం ఆజాద్‌చౌక్‌లో మంగళవారం రాత్రి సిటీ నియోజకవర్గం టీడీపీ ఆధ్వరంలో నారా హమారా- టీడీపీ హమారా నినాదంతో నూర్‌బాషాసాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు చేశారు. భారీ కేక్‌ను కట్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో మసీదుల అభివృద్ధి, షాదీ ఖానాల నిర్మాణం, ముస్లిం బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి నిధులు మంజూరై పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని, దురదృష్టవశాత్తు ప్రభుత్వ మారడంతో ఆ జీవోలన్నీ అమలుకు నోచుకోక వచ్చిన నిధులు వెనక్కి మళ్లించి ఆ అభివృద్ధి పనులు జరగకుండా వైసీపీ ప్రజాప్రతినిధులు ఆపేశారని ఆరోపించారు. ఆ నిధులను నేటికీ ఎంపీ భరత్‌రామ్ కానీ ఆ పార్టీ నాయకులు గానీ వెనక్కి రప్పించకుండా మైనార్టీలను మభ్యపెట్టే విధంగా మాటలు చెబుతున్నారన్నారు.అనంతరం ముస్లిం మైనార్టీ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చాన్ బాషా, జనసేన పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, మహబూబ్ జానీ, మహబూబ్ ఖాన్, మజ్జి రాంబాబు, ద్వారా పార్వతి సుందరి, మాలే విజయలక్ష్మి, వైశ్రీను పాల్గొన్నారు.

## నేడు ఐక్యత విజయపథం బహిరంగ సభ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: పేదరిక విముక్తే లక్ష్యంగా ఐక్యత విజయపథం బహిరంగ సభను రాజమహేంద్రవరం జాంపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ గ్రౌండ్స్‌లో బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నామని అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండేం సంతోష్ కుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయపథం దళపతి విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భావితరాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ధ్యేయంతో 2023 జూలై 23న ఆంధ్ర సరిహద్దు తిరుపతి జిల్లాలో తడ నుంచి ఐక్యతా విజయపథం పాదయాత్ర చేపట్టార న్నారు. ఇప్పటి వరకూ 2400 కిమీ నడిచారని చెప్పారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం వస్తున్నారని అందుకే సభను ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో దళిత నాయకులు కోరుకొండ చిరంజీవి, కనికెల్లి మురళీ, దాసరి మురళీ, గెల్లా రాజేంద్ర, ములపర్తి అశోక్ కుమార్, తరిట్ల చరణ్, మేరుగు ఏసురత్నం ,దమ్ము కేశవ తదితరులు పాల్గొన్నారు.

## రెస్టారెంట్‌లో విజిలెన్స్ తనిఖీలు

ఐదు గృహ వినియోగ సిలిండర్ల స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలంలోని రెస్టారెంట్లు, కర్రీపాయింట్లలో విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేశ్ బాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. రాజానగరం మార్కెట్ రోడ్‌లోని అమృత రెస్టారెంట్‌లో వాణిజ్యావసరాల కోసం వినియోగిస్తున్న ఐదు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకు న్నారు. రెస్టారెంట్ యజమాని పామర్తి రమేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడడం నేరమన్నారు. అలా వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ సిలిండర్లను అందజేస్తున్న వారిపై కూడా నిఘా పెట్టామని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ జగన్నాథరెడ్డి, డీసీటీవో షబ్బీర్, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్వారీగోతులతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరే!

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతంలో సింహాల్‌నగర్, సుబ్బారావునగర్‌ల మధ్య ఉన్న గోతుల వల్ల అనేక మంది ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థాయి సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికి చాలా మంది బాలలు, యువకులు క్వారీ గోతుల్లో పడి మరణించారని ఇటీవల ఒవ వ్యక్తి మరణించాడని తెలిపారు. ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా గోతులను పూడ్పించడం లేదన్నారు. సమస్య పరిష్కరించే వరకు ఉద్యమం చేస్తావన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్

అనపర్తి, జనవరి 23: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పడిందని కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని దుప్పలపూడి సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ సంస్థతో ఏర్పడిన తగాదాల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చిన్నచిన్న సమస్యలను సబ్‌స్టేషన్ల పరిధిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ద్వారా ఏర్పడే సమస్యలు వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై జీబీఆర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ వి.జనార్ధనరావు, స్వతంత్ర సభ్యుడు ఆర్.సురేంద్రకుమార్, ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, టీఈఈ పి.ఉషారాణి, డీఈఈ నిరంజన్, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట ఏఈలు వీరభద్రరావు, బుజ్జి దొర, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సాపురంలో జనసేన మహా పాదయాత్ర

కోరుకొండ, జనవరి 23: మండలంలోని నర్సాపురంలో మంగళవారం రాత్రి జనం కోసం జనసేన మహాపాదయాత్రను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, జనసైనికులు, వీరమహిళలతో కలిసి నిర్వహించారు. ముందుగా రామాలయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మికి గ్రామంలో మహిళలు మంగళనీరాజనాలు అందించారు. కార్యక్రమంలో మట్టానాగేశ్వరరావు, చొంగా శ్రీరామం, ప్రగడ పోసిరాం, మారిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

## భాష్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: రోడ్డు భద్రతపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ రామనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం బాబానగరం భాష్యం స్కూల్లో మంగళవారం జరిగిన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత, నివారణ, సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు మాధురి ఫస్ట్‌ఎయిడ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ రాధిక, ఏఎస్ఐ సాంబశివరావు, భాష్యం స్కూల్ జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఏఐకేఎంఎస్ సర్వసభ్య సమావేశం

రాజానగరం, జనవరి 23: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం బుధవారం రాజానగరంలోని డివిజన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ జిల్లా స్థాయి సాధారణ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట్‌నాయుడు ఓ ప్రకటనలో కోరారు. ఏఐకేఎంఎస్, కార్మిక సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు విచ్చేసే ఈ సమావేశానికి రైతు కూలీ సంఘ సభ్యులంతా విధిగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

### రేపు ఏఐకేఎంఎస్ మహాసభ

ఈ నెల 25న రాజానగరంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 10వ మహాసభను జయప్రదం చేయాలని వింజుమళ్ల చిట్టిబాబు, కుంజా దూలన్న కోరారు. ఈ సందర్భంగా స్థానిక అన్నదాన సంత్రం కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాలు.. నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెంచడం వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. సమావేశంలో రైతుకూలీ సంఘం నాయకులు పెంటపల్లి భీమశంకర్, శాగంటి లక్ష్మి, చీకట్ల వెంకటేశ్వరరావు, చింతా రాజారెడ్డి పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

కడియం, జనవరి 23:: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని మంగళవారం కడియంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో తహశీల్దారు ఎం.సుజాత మాట్లాడుతూ ఈనెల 25న ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వి.లజపతి రాయ్, నాగేశ్వరరావు, హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, సువర్ణవేణి, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనపై అవగాహన సదస్సు

రంగంపేట, జనవరి 23: దోమకాటుపై అశ్రద్ధ చేయొద్దని, అది అనేక రకాల వ్యాధులకు కారణమవుతోందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇశ్రాయేలు అన్నారు. మంగళవారం మండలంలోని వడిశలేరులో సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి అధ్యక్షతన వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు, దోమల నిర్మూలనకు తీసుకోవలసిన విషయాలపై విద్యార్థిని సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సువర్ణలత అవగహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోతుల బుల్లివీర్రాజు, ఉపసర్పంచ్ సత్తి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

అనపర్తి, జనవరి 23: అనపర్తిలో వీరుళ్లమ్మ జాతరలో ఈనెల 17న తప్పిపోయిన బాలుడు పఠాన్ సమీర్‌ను పోలీసులు విజయనగరం జిల్లా ధర్మపురిలో గుర్తించి మంగళవారం బాలుడి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ జాతరలో తమ కుమారుడు తప్పిపోయినట్టు తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలించామన్నారు. ధర్మపురిలో బాలుడు లభ్యం కావడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించినట్టు చెప్పారు. బాలుడి ఆచూకీ కోసం కృషి చేసిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, సీఐ శివగణేష్ అభినందించారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు చక్రపాణి మృతి

కోరుకొండ, జనవరి 23: కోరుకొండలో టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొచ్చెర్ల చక్రపాణి మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెదారు. ఆయన టీడీపీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేశారు. ఆయన మృతి పట్ల టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, తనకాల నాగేశ్వరరావు, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, మాతా సీతారాముడు, కాళ్ళచర్ల వెంకటేశ్వరరావు, కటకంచలం, వాకా నరసింహారావు, నీరుకొండ బాబ్జి సంతాపం తెలిపారు.

## గ్రావెల్ అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయి పరిశీలన

కడియం, జనవరి 23: మండలంలోని వేమగిరిలో స.నెం 127/2లో య.14-44 సెంట్లులో సుమారు నాలుగెకరాల విస్తీర్ణం భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేశారంటూ రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌కు చెందిన నందం వీరవెంకట సుబ్రహ్మణ్యం తహశీల్దారు ఎం.సుజాతకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం గ్రామ సర్వేయర్‌తో కలిసి వీఆర్వో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దీనితో స.నెం 127/2లో య.14-44 జిరాయితీ భూమి అయి ఉందని, అందులో సుబ్రహ్మణ్యం భూమి కూడా ఉందని గుర్తించారు. అయితే నాలుగెకరాల భూమిలో రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి బయటకు రవాణా చేసినట్టు గుర్తించారు. క్షేత్ర పరిశీలనకు వెళ్లిన సమయంలో పలు లారీలు, రెండు క్రేన్‌లు నిలుపుదల చేసినట్టు తెలిపారు.



## పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జ్యోతిబాబు

రంగంపేట, జనవరి 23: రంగంపేట మండలం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడిగా మోర్త జ్యోతిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వడిశలేరులో మంగళవారం సీహెచ్ సామ్యూల్‌సుదర్శన్ అధ్యక్షతన జరిగిన పాస్టర్స్ మండల సమావేశంలో 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సీహెచ్ సామ్యూల్‌సుదర్శన్, అధ్యక్షుడిగా మోర్త జ్యోతిబాబు, ఉపాధ్యక్షుడిగా ప్రసన్నకుమార్, గౌరవాధ్యక్షుడిగా గిద్యోను, సెక్రటరీగా నీరుమల్లి ఒనేసేమూకుమార్, ట్రెజరర్‌గా మందపల్లి చిట్టిబాబు, కె.విజయరత్నం, చీఫ్ అడ్వైజరుగా ఎస్.చక్రవర్తి, కూసు సామ్యూల్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## మర్రిపూడిలో 'ఆరోగ్య సురక్ష'

రంగంపేట, జనవరి 23: మండలంలోని మర్రిపూడి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సర్పంచ్ వేము మాధవి అధ్యక్షతన రంగంపేట పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జరిగిన ఈ క్యాంపులో సుమారు 411 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో కొందరిని మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, కొల్లాటి ఇశ్రాయేలు, అడబాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి గౌరీ శాంతి, సిహెచ్‌వో కె.జయమణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆదర్శ సిబ్బందికి సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్ జనవరి 23 : రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. డిపో మెయిన్ గేట్ వద్ద జరిగిన సభలో 2023 డిసెంబరులో అత్యధిక ఆదాయం ,అత్యధిక డీజిల్ సేవింగ్స్ సాధించిన సిబ్బందిని ఎంపిక చేసి డిపో మేనేజరు ఎస్కె షబ్నం చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులు , ప్రశంసాపత్రం అందజేశారు.



రాజమహేంద్రవరంలో ఆటో డ్రైవర్ల నిరసన ప్రదర్శన

# ఆటో..ఇటో తేల్చుకుంటాం!

### మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకం వ్యతిరేకిస్తూ బంద్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23 : ఆటో ఇటో తేల్చుకుంటాం. అంటూ మహిళలకు ఉచిత బస్ పథకంపై బంద్‌కు దిగారు. జిల్లా వ్యాప్తంగా ఆటోలను ఆపివేసి నిరసన ప్రదర్శన చేశారు. జేఏసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్ పాటించారు. రాజమ హేంద్రవరంలో మంగళవారం జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్(బాక్స్‌ప్రసాద్), నల్లం శ్రీను, బట్లంకి ప్రకాష్‌లు ఆటో కార్మికులతో కలిసి నిరసన ప్రదర్శన చేసి మాట్లాడారు. లక్షలాది కుటుంబాలు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ఇప్పటికే వివిధ ట్యాక్స్‌ల భారంతో ఇబ్బందులతో ఆటో వర్కర్లు నెట్టుకొస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశ పెడితే ఆటో కార్మికులు జీవితాలు అగమ్యగోచరమవుతాయన్నారు. కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం వల్ల ఆటో వర్కర్స్ ఉపాధి కోల్పోయి దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ పథకం అమలు చేయవద్దని ఏ పార్టీ ఇలాంటి పథకాలు హామీలుగా ఇవ్వవద్దని కోరారు. జిల్లా వ్యాప్తంగా కొవ్వూరు, అనపర్తి, గోకవరం,రాజానగరం, కడియం మండలాల్లో ఆటోల బంద్ విజయ వంతమైంది.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా మందికి ఆటోల బంద్ సమాచారం తెలియక తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.



రాజమహేంద్రవరంలో మహిళల రక్తదానం



రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే గోరంట్ల

# ఘనంగా నారా లోకేశ్ జన్మదినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవం మంగళవారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ పలు సేవాకార్యక్ర మాలు చేశారు.. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. టీడీపీ నాయకులు లోకేశ్ జన్మదినోత్సవం పండుగలా చేశారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో మద్దిపాటి వెంకట రాజు ఆధ్వర్యంలో 90 మంది టీడీపీ నాయకులు రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం దానవాయిపేట గానుగ వీధిలోని సంజీవిని బ్లడ్ బ్యాంక్‌లో 150 మంది మహిళలు రక్తదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ భవిష్యత్తు నాయకుడు నారా లోకేశ్ అన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు వలే లోకేశ్ కూడా మంచి విజన్ ఉన్న నాయకుడని అన్నారు. యువగళంతో తానేంటో నిరూపించుకున్నారని చెప్పారు. ఉర్లంకల లోకేష్ ఆధ్వర్యంలో 37వడివిజన్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, కప్పల వెలుగుకుమారి, ఉప్పులూరి జానకీ రామయ్యద్వారా పార్వతీ సుందరి, మీసాల నాగమణి, గొర్రెల సత్యరమణి, కూరాకుల తులసీ, కానేటి కృపామణి, సింహా నాగమణి, కోన సత్య, కర్ణం లక్ష్మి, మోతా నాగలక్ష్మి, బర్ల గిజ, దొంగ నాగమణి, కె శ్యామల, బండారు సత్తిబాబు, లోలుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో రోడ్డుపై కూర్చున్న అంగన్‌వాడీలు

# గెలిచారా.. ఓడారా!?

## అంగన్‌వాడీలకు మళ్లీ హామీలతోనే సరి!

- నీరుగారిన ఉద్యమం
- బెదిరించిన ప్రభుత్వం
- దిగొచ్చిన అంగన్‌వాడీలు
- నెరవేరని డిమాండ్లు
- చర్చలు సఫలమని ప్రకటన
- 42 రోజుల సమ్మె విరమణ
- విధులకు హాజరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పోరాడి ఓడారా.. ఓడి గెలిచారా.. వారికే ఎరుక.. కేవలం గత ఎన్నికల ముందు జగన్ స్వయంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఏకంగా 42 రోజుల పాటు ఏకధాటిగా సాగిన అంగన్వాడీ ఉద్యమం వైసీపీ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించింది. జిల్లా వ్యాప్తంగా 1556 అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేసి 1538 టీచర్లు, ఆయాలు 1493 మంది (టీచర్లు, ఆయాలు) అంగన్వాడీలు ఒక్కమాటపై నిలబడి పోరాడారు.. డిమాండ్లను సాధించే వరకూ మెట్టు దిగేదిలేదని భీష్మించారు. ప్రభుత్వం భయపెట్టినా భయపడ లేదు.. వారి తెగింపును చూసి అంతా ఆశ్చర్యపోయారు. డిమాండ్లు సాధిస్తారని అనుకున్నారంతా అయితే పూర్తి తమ డిమాండ్లను పరిష్కరించుకోలేకపోయారు. అయితే ప్రభుత్వం మాత్రం మరింత వ్యతిరేకతను మూటగట్టుకుంది.

### గత నెల 12 నుంచి సమ్మె

అంగన్‌వాడీల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం దిగిరాకపోవడంతో సోమవారం తాడేపల్లిలో సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు.ఈ మేరకు బయలుదేరిన మహిళలను దారుణంగా అణచివేస్తూ అదుపులోనికి తీసుకుని మహిళలని కూడా చూడకుండా వేర్వేరు ప్రాంతాలకు తిప్పుతూ సోమవారం సాయంత్రం వరకూ ఇబ్బందులు పెట్టింది.అయితే ప్రభుత్వం అదే సమయంలో చర్చలకు నాయకులను పిలిచి మాట్లాడింది. చివరకు సరైన రాతపూర్వక హామీలు ఇవ్వకుండానే సమ్మె విరమిస్తున్నట్టు సమ్మెకు మద్దతుగా ఉన్న వివిధ సంఘాల నేతలు ప్రకటించారు. దీంతో మంగళవారం అందరూ విధులకు హాజరయ్యారు.ప్రతిపక్షనేత హోదాలో నాడు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిసెంబర్ 12 నుంచి అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు ఉపక్రమించారు.కానీ మొదట్లో సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రత్యామ్నాయంగా సచివాలయ ఉద్యోగులకు అంగన్వాడీ బాధ్యతలు అప్పగించింది. ఏకంగా అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలుకొట్టి చాలా కేంద్రాలు తెరిపించింది. కానీ ఎక్కడా పూర్తిస్థాయిలో పిల్లలకు, బాలింతలకు,గర్భిణులకు చేరవలసిన సరుకులు పూర్తిస్థాయిలో చేరలేదు. కానీ అంగన్వాడీలంటే ఏంటనేది ప్రజలందరికీ అర్థమైంది. ప్రభుత్వం మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా చాలా ఇబ్బందులు పెట్టింది. ఎస్మా చట్టం ప్రయోగించింది. చివరకు నోటీసులు ఇచ్చింది. ఉద్యోగాలు తీసేస్తామని ప్రత్యామ్నాయంగా కొత్తవారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామని చిన్న ఉద్యోగులను తీవ్రస్థాయిలో భయపెట్టింది. అయినా లొంగలేదు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి ఛలో విజయవాడ పేరుతో వేలాది మంది తరలివెళ్లారు. ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. దొరికినవారిని దొరికినట్టు పట్టుకుని బస్సులు ఎక్కించి, వేరే ప్రాంతాలకు తరలించి ఇబ్బందులకు గురిచేశారు. అయినా ప్రభుత్వం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ప్రధాన డిమాండ్ అయిన జీతం పెంపును జూలై నుంచి అమలు చేస్తామని ప్రకటించడంతో ఉద్యమ నేతలు సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు. సమ్మె విజయవంత మైనట్టు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీ యూ సంఘాలు ప్రకటించాయి.

### హామీలు అమలయ్యేనా..?

మళ్లీ హామీలకా ఇన్ని రోజులు సమ్మె చేసిందని పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే 42 రోజుల సమ్మె కారణంగా సాధించిందేమిటంటే తిరిగి హామీలే. జూలైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం అంగీకరించింది. గ్రాట్యుటీ విషయాన్ని కేంద్రానికి సిఫారసు చేస్తామని, ఉద్యోగ విరమణ సమయంలో ఇచ్చే ప్రయోజనాలను వర్కర్లకు రూ.50 వేల నుంచి లక్షా 20 వేలకు పెంచడానికి అంగీకరించింది. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తామని ప్రకటించింది. సర్వీసులో చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్టు నేతలు ప్రకటించారు. వైఎస్‌ఆర్ బీమా అమలు చేస్తామని, మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇస్తామని, హెల్పర్ల ప్రమోషన్ వయస్సు 45 నుంచి 50 ఏళ్లకు పెంచుతామని హామీ ఇచ్చినట్టు నేతలు చెబుతున్నారు. ఇవన్నీ అమలు చేయవలసిన ప్రభుత్వం మళ్లీ కేవలం హామీలివ్వడం గమనార్హం. కానీ సమ్మె విజయవంత మైందని, విజయవాడ నుంచి జిల్లాకు రైలులో వచ్చిన నాయకులకు మహిళలు స్వాగతం పలికి, సంబరాలు చేసుకోవడం గమనార్హం.

### అంగన్వాడీ వ్యవస్థ ఛిన్నాభిన్నం

అంగన్‌వాడీలు చేసిన 42 రోజుల సమ్మె వల్ల ప్రభుత్వానికి సరుకులు మిగిలినట్టు అయింది. చాలా కేంద్రాలను కేవలం రెండు మూడు గంటలు తెరచి వచ్చినవారికి అన్నంపెట్టి పంపేశారు. మొదట్లో సరఫరా చేసిన సరుకులనే పంపిణీ చేశారు. రెండో దఫా సరుకులు రాలేదు. ఉద్యమ సమయంలో అంగన్వాడీల నిర్వహణ లోపాలు బయటపడ్డాయి. మంగళవారం జిల్లాలో మొత్తం అన్ని కేంద్రాల్లోనూ వర్కర్లు, హెల్పర్లు బాధ్యతలు స్వీకరించారని అన్ని కేంద్రాలు నడుస్తున్నాయని ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మితెలిపారు.

### ఎన్నికల ముంగిట అమలెలా?

ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఐదేళ్ల కిందట జగన్ ఇచ్చిన హామీలకే సీఎం అయిన తరువాత కూడా దిక్కులేదు.. ప్రస్తుతం ఎన్నిక ఏడాది.. వచ్చే నెలలో మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది.. మళ్లీ హామీలే తెచ్చుకుని ఎలా విజయం సాధించామని చెప్పుకుంటున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.. కనీసం 10వ తరగతి చదువుకోని చాలా మంది అంగన్‌వాడీలు మాత్రం నాయకులు విజయం సాధించామంటే తాము విజయం సాధించామని ఆనంద పడుతున్నారు. అయితే మేధావులు మాత్రం అంగన్‌వాడీలను అణచివేసి ప్రభుత్వం విజయం సాధించిందని చెబుతున్నారు. ఎందుకంటే జూలై నెలలో వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వడంలోనే అసలు మెలిక ఉందనేది చాలా మంది వాదన.



### అంగన్‌వాడీల క్యూ

సుమారు 44 రోజుల తర్వాత అంగన్‌వాడీలు విధులకు క్యూకట్టారు. సోమవారం ఉదయం నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు జాయి నింగ్ లెటర్‌పై తేదీ, సమయం, వేసి రాత పూర్వకమైన లెటర్లను సూపర్‌వైజర్లకు అంద జేసి విధులకు హాజరవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సోమవారం ఉద యం నుంచే అంగన్‌వాడీలు క్యూకట్టారు. చర్చలు ఫలించినట్టు ప్రకటించడంతో మం గళవారం అంతా లెటర్లు పట్టుకుని యధావిధిగా విధులకు వచ్చేశారు. - **గోపాలపురం**



# నేటి నుంచి 6 నిజం గెలవాలి



రొక్కల రాణి కుటుంబీకులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

## నాపై ఇప్పటి వరకూ 37 కేసులు..

### టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జనవరి 23: ఎన్నికలు పూర్తవడానికి ఇంకా 80 రోజులు ఉందని ఈ ఎనభై రోజుల్లో ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేసేది లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బిక్కవోలు పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఇస్తున్న జీవోలపై ప్రజలను చైతన్యం తెస్తామన్నారు. ఆ జీవో ప్రతులను, ఆ లోగోలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేయమని టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారన్నారు.ఈ మేరకు రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లో 28 మంది టీడీపీ నాయకులు, నాపై రెండు చోట్లా ఎఫ్ఐఆర్‌లు వేసి మంగళవారం నోటీసులు అందజేశారన్నారు. అనపర్తి పోలీసులు, జిల్లా ఎస్పీని ప్రశ్నిస్తున్నా.. భోగి మంటల్లో జీవో ప్రతులను, లోగోలను వేస్తే ఆగమేఘాల మీద మా మీద కేసులు నమోదు చేశారని అయితే ఏడాదిన్నర కిందట అనపర్తిలో అప్పటి ఎస్ఐ ఉమామహేశ్వరరావు సూచనలు ఇస్తూ చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేయిస్తే ఇంత వరకూ కేసులు లేవన్నారు.ఎందుకీ వివక్ష అని పోలీసులను ప్రశ్నిస్తున్నానన్నారు. ఇప్పటికే ఈ కేసులతో కలిపి నాపై 37 కేసులు నమోదు చేశారని అయినా ప్రజల తరపున పోరాటం చేయడం జరుగుతుందన్నారు.

### రేపు బిక్కవోలుకు భువనేశ్వరి రాక

బిక్కవోలు, జనవరి 23 : నారా భువనేశ్వరి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. "నిజం గెలవాలి" కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అరెస్టు టీవీలో చూసి తట్టుకోలేక గుండెపోటుతో మృతిచెందిన బిక్కవోలుకు చెందిన రొక్కల రాణి కుటుంబీకులను చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించనున్నారు. ఈ నెల 25న మండపేటలో పర్యటనను ముగించుకుని రాత్రికి బలభద్రపురం ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో బస చేస్తారన్నారు. 26 ఉదయం బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం రొక్కల రాణి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి సంఘీభావం ప్రకటిస్తారన్నారు.

## దళిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై దాడి



దళితులపై దాడులు పెరుగుతున్నాయి.. తాజాగా రాజమహేంద్రవరంలో ఒక ఘటన జరిగింది.. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.. రాజమహేంద్రవరానికి చెందిన కప్పల రజనీదేవి, ధనరాజు భార్యభర్తలు.. ఇద్దరూ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గా పనిచేస్తున్నారు. ఈ నెల 21వ తేదీన ఒక వ్యక్తి డివైడర్‌పై చెత్త వేస్తుండడంతో అడ్డుకున్నారు. దీంతో అతను ఇరువురిపై దాడికి దిగాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.. - వివరాలు మెయిన్‌లో

## వృద్ధులను అగౌరవపరచినా.. వేధించినా నేరమే

### సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత వారి పిల్లలపై ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో వయోవృద్ధుల సంక్షేమంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల పట్ల వారి పిల్లలు అగౌరవంగా వ్యవహరించినా, వేధింపులకు గురిచేసినా చట్ట రీత్యా నేరమన్నారు. వయోవృద్ధుల పోషణను నిర్లక్ష్యం చేసిన పక్షంలో మెయింటెనెన్స్ కోసం ఆర్డీవో ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేయవచ్చన్నారు. న్యాయ స్థానంలో కూడా సీఆర్పీసీ సెక్షన్ 125 ప్రకారం పిటిషన్ వేసుకోవచ్చని సూచించారు. వయోవృద్ధులకు ఎలాంటి న్యాయ సమస్యలు ఉన్నా ఉచిత సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. వయోవృద్ధుల హక్కులపై ఉన్న చట్టాలు, నల్సావారి వయోవృద్ధులకు న్యాయ సేవల పథకం-2016, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 గురించి విశదీకరించారు. కార్యక్రమంలో ఐటీఎస్ జీఎం పలివెల రాజు, డీజీఎం జీవీ మనోజ్ కుమార్, పారా లీగల్ వలంటీరు జీఎస్‌వీఎస్ఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి



ప్రభుత్వాసుపత్రిలో కేంద్ర సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాఘెల్

## కేంద్రం ఇచ్చిన నిధులకు తగినట్టు సదుపాయాల్లేవ్

- నిధులు కేంద్రానివి.. ప్రచారం వైసీపీది
- జిల్లా ఆసుపత్రిలో 2 గంటల పాటు పరిశీలన
- కేంద్ర సహాయ మంత్రి బాఘెల్

రాజమహేంద్రవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. వేల కోట్ల రూపాయలతో ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన సదుపాయాలను కల్పిస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాఘెల్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. సుమారు రెండు గంటల పాటు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి విభాగాల పనితీరును వివరించారు. ముందుగా మంత్రి మొక్కలను నాటిన అనంతరం ఓపీ రిజిస్ట్రేషన్ల గదిని పరిశీలించారు. కేంద్రం ఇచ్చే నిధులకు తగినట్లుగా ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పన జరుగుతున్నట్టు కనిపించడం లేదన్నారు. 70శాతం నిధులు కేంద్రమే భరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఫ్లెక్సీలతో ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీలో అందిస్తున్న చికిత్సలకు గరిష్ఠ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిందని అధికారులు వివరించగా.. పెంచడం ముఖ్యం కాదని ఎంత మంది లబ్ధిపొందుతున్నారని ప్రశ్నించారు.పలు విభాగాలను పరిశీలించిన అనంతరం ఆస్పత్రి అధికారులతో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యం, సదుపాయాల గురించి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభ మంత్రికి వివరించారు. క్యాన్సర్‌కి కేంద్రానికి మంజూరు చేసిన నిధులకు సమకూర్చిన సదుపాయాలకు పొంతన కుదరడం లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రాధాన్యం గురించి వివరించారు. జన ఔషధి ఫార్మసీల గురించి ఆరా తీసిన ఆయన ఇంకా అవసరమైన వాటికి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. మంత్రి ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు పక్కదారి పడుతున్నాయా? కేంద్ర ఉద్దేశం నెరవేరే విధంగా పనులు ఉన్నాయా? అనే అంశాలపైనే దృష్టి సారించారు. ఆయన ప్రభుత్వాస్పత్రిలో దాదాపు రెండు గంటలపాటు చేసి పరిశీలన కూడా ఆ దిశగానే సాగింది. ఎక్కడా రోగులతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు.ఆయన వెంట ఆర్ఎంవోలు డాక్టర్ నజీరుద్దీన్,డాక్టర్ ప్రణవ్, వైద్యులు డాక్టర్ హేమంతి, డాక్టర్ సునీత, డాక్టర్ విజయబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.ప్రియాంక, మెడికల్ ఇంజనీరింగ్ అధికారులు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, రేలంగి శ్రీదేవి ఉన్నారు.

### మరో ఐదేళ్ల పాటు ఉచిత బియ్యం

నిడదవోలు, జనవరి 23: అర్హులైన పేదలకు ఒక్కొక్కరికి ఐదేసి కిలోల చొప్పున మరో ఐదేళ్లపాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తామని కేంద్ర సహాయ మంత్రి బాఘెల్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మంగళవారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉచిత బియ్యం పంపిణీ సుమారు 80 కోట్ల మందికి కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు అమలు కానుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. తాజాగా ఉజ్వల పథకం ద్వారా దేశంలో సుమారు 11 కోట్ల మంది మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. పేదలకు బియ్యం, గోధుమలు ఉచితంగా ఇవ్వడానికి ప్రధాని మోదీ జేబులో డబ్బులు ఖర్చు చేస్తున్నారా? అంటూ రాష్ట్ర పాలకులు విమర్శిస్తున్నారని.. ఆ డబ్బులు వైసీపీ ప్రభుత్వం భరిస్తోందా అని ప్రశ్నించారు.పేదలను ఆదుకునే బాధ్యత కేంద్రంపై ఉంటుందన్నారు.

## ఆటో డ్రైవర్ల నిరసన



కొవ్వూరు టోల్‌గేట్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

కొవ్వూరు, జనవరి 23: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మదర్‌థెరిస్సా ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రామకృష్ణ, యాసారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కొవ్వూరు టోల్‌గేట్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన ధర్నా నిర్వహించారు. ఆటో డ్రైవర్ల కడుపు కొట్టొద్దు. ఫ్రీ బస్సులు వద్దు అంటూ నినాదాలు చేశారు. కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల మాదిరిగా ఏపీలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయాలని తీసుకున్న నిర్ణయంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డు పాలవుతాయని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రాజమహేంద్రవరంలో కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం వరకు ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో గోదావరిమాత ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.దుర్గాప్రసాద్, కె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

కొవ్వూరు, జనవరి 23: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## కొవ్వూరులో అంగన్వాడీల విజయోత్సవ సభ

కొవ్వూరు, జనవరి 23: అణచివేత, నిర్బంధాలను ఎదిరించి 42 రోజులపాటు కనీస వేతనాల కోసం అంగన్వాడీ మహిళలు పోరాడిన తీరు ఆదర్శప్రాయమని పలువురు నాయకులు కొనియాడారు. మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సీహెచ్.పుష్పావతి ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె విజయోత్సవ సభ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో జరిగిన చర్చల్లో అంగన్వాడీలు సమ్మె నోటీసులో ఇచ్చిన 11డిమాండ్లలో పదింటిని ఇప్పటికే నెరవేర్చారన్నారు. జీతాలు జూలై నెలలో పెంచుతామని హామీ ఇచ్చారని, వేతనాల పెంపుపై తీసుకున్న నిర్ణయాన్ని మినిట్స్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు నాయకులు ఈమని మల్లిక, అంగన్వాడీలు వి.శ్రీదేవి, సీహెచ్ భవాని, ఎస్.మధురవల్లి, ఎస్.శాంతకుమారి, పి.విజయకుమారి, జె.మహాలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం నుంచి సీడీపీవో కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి విధుల్లో చేరారు.

## వాడపల్లిలో వ్యక్తిపై దాడి

కొవ్వూరు, జనవరి 23: పాత గొడవల నేపథ్యంలో ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన వారిపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన గాడి ఏడుకొండలను అదే గ్రామానికి చెందిన కొయ్యే ప్రేమ్‌కుమార్ ఈ నెల 22న కొట్టి గాయపర్చాడు. దీంతో అతడిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏడుకొండలు ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## తాళ్లపూడిలో వైసీపీ ఆత్మీయ సమావేశం

తాళ్లపూడి, జనవరి 23: తాళ్లపూడిలో వైసీపీ ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. దీనికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ విచ్చేసి మాట్లాడారు. సీఎం జగన్ నియమించిన అభ్యర్థులను గెలిపించి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**చాగల్లు:** నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా తలారి వెంకటరావు నియమితులైన సందర్భంగా మంగళవారం చాగల్లులోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ కృష్ణ విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వెంకటరావు, గండ్రోతు సురేంద్రకుమార్, గారపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి

తాళ్లపూడి, జనవరి 23: మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోస్ గొప్పతనాన్ని ప్రధానోపాధ్యాయులు దుర్గారావు వివరించారు. 'నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అనే నినాదంతో సింహంలా గర్జించిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు.

## ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ఉండ్రాజవరం, జనవరి 23: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని కె.సావరంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. స్థానిక కోదండ రామాలయం వద్ద ముత్యాలమ్మ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో వెంపాలి హాసిని, తూము పద్మప్రణీత, వై.దీపిక, మీసాల జాహ్నవి మొదటి నాలుగు స్థానాల్లో నిలిచి బహుమతులు గెలిపొందారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఉద్యోగ ప్రయత్నంలో విఫలమై ఆత్మహత్య


### చిలకపాడులో ఉరివేసుకున్న యువకుడు

ఉండ్రాజవరం, జనవరి 23: చిలకపాడు గ్రామానికి చెందిన కనిపే టైసన్ బాబు(23) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ వి.అప్పలరాజు మంగళవారం తెలిపారు. తెల్లవారుజామున ఇంటి వరండాలోని శ్లాబ్‌కు ఉన్న ఇనుప హుక్కునకు చీరతో ఉరి వేసుకున్నాడని, తల్లిదండ్రులు శబ్దం విని బయటకు వచ్చి కిందకి దించి సపర్యలు చేసేలోగా మృతి చెందినట్టు చెప్పారు. టైసన్ బాబు ఉద్యోగ ప్రయత్నం ఫలించకపోవడంతో మానసికంగా వేదన చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

## ఓటు హక్కు వినియోగంపై వ్యాసరచన పోటీలు

దేవరపల్లి, జనవరి 23: దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో ఓటు హక్కు వినియోగంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను తహశీల్దార్ రామకృష్ణ పరిశీలించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలదాసు, హెచ్‌ఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఈబీ సీఐగా స్వామి



దేవరపల్లి, జనవరి 23: దేవరపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేవీ స్వామి బాధ్యతలు స్వీకరించారు. తాను కాకినాడ జిల్లా నుంచి బదిలీపై వచ్చానని, ఇప్పటివరకు దేవరపల్లి సెబ్ అధికారిగా విధులు నిర్వహించిన డీ.సుధ ఏలూరు జిల్లా కైకలూరు వెళ్లారన్నారు. సారా తయారు చేసినా, అక్రమంగా మద్యం తరలించినా కఠిన చర్యలు తప్పవని, సారా బట్టీల వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్‌ఎఫ్

అనపర్తి, జనవరి 23: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పడిందని కన్జ్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్ (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని దుప్పలపూడి సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ సంస్థతో ఏర్పడిన తగాదాల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చిన్నచిన్న సమస్యలను సబ్‌స్టేషన్ల పరిధిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ద్వారా ఏర్పడే సమస్యలు వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై జీబీఆర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ వి.జనార్ధనరావు, స్వతంత్ర సభ్యుడు ఆర్.సురేంద్రకుమార్, ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, టీఈఈ పి.ఉషారాణి, డీఈఈ నిరంజన్, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట ఏఈలు వీరభద్రరావు, బుజ్జి దొర, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉమ్మడి 'తూర్పు గోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు భువనేశ్వరి పర్యటన

● చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పరామర్శ

# 'యువగళం'తో రాజకీయాల్లో నూతన ఒరవడి

- మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు
- ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు



నిడదవోలులో లోకేశ్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి

నిడదవోలు, జనవరి 23: అధికార పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పి యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చిన నాయకుడు నారా లోకేశ్ అని, యువగళం పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాల్లోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినాన్ని పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిడదవోలులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి లోకేశ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, కారింకి నాగేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, షాజహాన్, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. నిడదవోలులోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలో కుందుల గణపతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరూరి సాయిబాబా, అనపర్తి వెంకట నారాయణ, కైకరపు సత్యనారాయణ, అంబటి వెంకటరమణ, మద్దుకూరి రాధ, కోడూరి సత్తిరాజు పాల్గొన్నారు.

**చాగల్లు:** చాగల్లులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, జొన్నకూటి వెంకాయమ్మ పాల్గొన్నారు. లోకేశ్ జన్మదిన సందర్భంగా ఊనగట్లలో హైస్కూల్ విద్యార్థులకు కాంపస్ బాక్సులు పంపిణీ చేశారు. బొల్లిన శివనాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నందిగం శ్రీనివాసరావు, కారింకి సత్యనారాయణ, వీరవల్లి సత్యన్నారాయణ, మానెల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని గౌరీపట్నంలో ఎన్టీఆర్ ట్రస్టు, టీడీపీ మండలాధ్యక్షుడు అంధ్రూ అనీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. అలాగే లోకేశ్ బర్తడే కేకును ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువగళం పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ అధికారంలోకి రాగానే అందరి సమస్యలు పరిష్కరిస్తామని యువతలో చైతన్యాన్ని నింపారన్నారు. కాగా 90మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గన్నమని హరికృష్ణ, పెనుమత్స సుబ్బరాజు, అంధ్రూ వెంకటేశ్వరరావు, పాతూరి గిరిధర్, కోఠారు ధృవకాంత్, రొంగలి సత్యనారాయణ, యద్దనపూడి బ్రహ్మరాజు, ఉప్పులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో కేక్ కటింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ముప్పిడి



దేవరపల్లి: గౌరీపట్నంలో కేకు కట్ చేస్తున్న మద్దిపాటి వెంకట్రాజు

# రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు కేంద్రం చేయూత

- కేంద్ర సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భాఘెల్
- సమిశ్రగూడెంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర



సమిశ్రగూడెంలో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భాఘెల్

నిడదవోలు, జనవరి 23: కేంద్రం నిధులతో రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలకు చేయూతనందించిందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భాఘెల్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మంగళవారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాల్లో వంద శాతం నిధులతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఒకప్పుడు గ్యాస్ కనెక్షన్ కోసం నెలలు తరబడి వేచి ఉండేవారని ఇప్పుడు అడిగిన వెంటనే గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామన్నారు. దేశంలో స్వచ్ఛ భారత్ ద్వారా పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పేదలు అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, మండలాధ్యక్షుడు మాట్ల వెంకటదుర్గారావు, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, రేలంగి శ్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సమిశ్రగూడెం జడ్పీ హైస్కూల్ ఆవరణలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలపై పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్లో స్థానికురాలు రామ పద్మావతికి చెందిన పుంగనూరు ఆవును, 17రోజుల వయసు, అడుగు ఎత్తు ఉన్న దూడను ప్రదర్శనలో ఉంచారు. ఈ స్టాల్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి పుంగనూరు ఆవు, దూడను చూసి ఆకర్షితులయ్యారు. ఆవును పెంచుతున్న రైతును ప్రత్యేకంగా అభినందించారు.

**కొవ్వూరు:** కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ఐసీఈ వ్యాను ద్వారా పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ బి.శ్రీకాంత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# బీసీలను నమ్మించి నట్టేట ముంచిన సీఎం జగన్

- టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు
- కొవ్వూరులో జయహో బీసీ సదస్సు



సదస్సులో ఐక్యత అభివాదం తెలుపుతున్న నాయకులు

కొవ్వూరు, జనవరి 23: సీఎం జగన్ బీసీలను నమ్మించి అన్నివిధాల నట్టేట ముంచాడని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ, మండలానికి సంబంధించి జయహో బీసీ సదస్సును స్థానిక లిటరరీ క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20శాతం రిజర్వేషన్ కల్పిస్తే చంద్రబాబు 34శాతానికి పెంచారని, అయితే దానిని జగన్‌రెడ్డి 10శాతం తగ్గించి బీసీలకు రాజకీయ భవిష్యత్ లేకుండా చేశారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేనలలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా ఒకరికొకరు సహకరించుకుని ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గం నుంచి వైసీపీ ఎవ్వరిని పోటీకి దించినా టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి 40 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. అలాగే నారా లోకేశ్ పుట్టినరోజును స్థానిక లిటరరీ క్లబ్‌లో ఇర్వహించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కేక్ కట్‌చేసి నాయకులకు పంచారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, చెన్నుబోయిన శ్రీనివాస్, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, అర్జిల్లి రామకృష్ణ, కాగిత రఘు, తుంపల్లి ఆదినారాయణ, జనసేన నాయకులు బోడసింగి రాంబాబు, కె.నవ్య, అచ్యుత రాయుడు, సుంకర సత్తిబాబు, కె.శ్రీను తదితరులు పాల్గొనారు.

# ఆ మూడు డిగ్రీ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్లనివ్వొద్దు

### నన్నయ వర్శిటీ ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్



యూనివర్శిటీ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

దివాన్‌చెరువు, జనవరి 23: అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీహెచ్‌ఎం కోర్సులను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు తీర్మానం చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, విశ్వవిద్యాలయాలు తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోతాయన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ చొరవ తీసుకుని సదరు మూడు డిగ్రీ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్లకుండా చూడాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి పద్మరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడు గంధం నారాయణరావు, నన్నయ వర్శిటీ ఎఫిలియేటెడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, అధ్యక్షులు కేవీఆర్ఎస్ నరసింహారావు, మల్లిడి అనంతరెడ్డి, బర్ల సత్యనారాయణ, సాంబశివరావు, గంగిరెడ్డి, గణేష్‌చౌదరితోపాటు వివిధ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### నేడు యువ సాధికారికత ఉపాధిపై వర్క్‌షాపు

నన్నయ యూనివర్శిటీలో సామాజిక ఇంజనీరింగ్ యాక్సెస్, చేరిక యువ సాధికారికత ఉపాధి అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు వీసీ కె.పద్మరాజు తెలిపారు. ఉదయం 10గంటలకు విశ్వవిద్యాలం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ వర్క్‌షాపునకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల అధ్యాపకులతోబాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు హాజరు కావాలని కోరారు. వర్క్‌షాపు కన్వీనర్‌గా ఆచార్య కె.శ్రీరమేష్, కోకన్వీనర్‌గా పి.ఉమామహేశ్వరి దేవి వ్యవహరిస్తారని తెలిపారు. వర్క్‌షాపుకు హాజరైన వారికి ఈ-సర్టిఫికెట్ అందజేస్తామని వీసీ చెప్పారు.

# నేడు ఐక్యత విజయపథం బహిరంగ సభ



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: పేదరిక విముక్తే లక్ష్యంగా ఐక్యత విజయపథం బహిరంగ సభను రాజమహేంద్రవరం జాంపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ గ్రౌండ్స్‌లో బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నామని అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండేం సంతోష్ కుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయపథం దళపతి విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భావితరాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ధ్యేయంతో 2023 జూలై 23న ఆంధ్ర సరిహద్దు తిరుపతి జిల్లాలో తడ నుంచి ఐక్యతా విజయపథం పాదయాత్ర చేపట్టార న్నారు. ఇప్పటి వరకూ 2400 కిమీ నడిచారని చెప్పారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం వస్తున్నారని అందుకే సభను ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో దళిత నాయకులు కోరుకొండ చిరంజీవి, కనికెల్లి మురళీ, దాసరి మురళీ, గెల్లా రాజేంద్ర, ములపర్తి అశోక్ కుమార్, తరిట్ల చరణ్, మేరుగు ఏసురత్నం ,దమ్ము కేశవ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'నిజం గెలవాలి'



కాకినాడ సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టుతో వేదనకు గురై మరణించిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆయన సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి..' కార్యక్రమంలో భాగంగా బుధవారంనుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజులపాటు పర్యటించనున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై అశువులు బాసిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఆర్థికసాయం అందించనున్నారు.

### మూడు రోజుల పర్యటన ఇలా

24న కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం, 25న అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం, 26న రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 11.30గంటలకు భువనేశ్వరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడినుంచి 12.30 గంటలకు జగ్గంపేట మండలం గుర్రపాలెం, 1.25గంటలకు పెద్దాపురం మండలం కాండ్రకోట, సాయంత్రం 4.05గంటలకు తుని రూరల్ మండలం తేటగుంట, 5.20 గంటలకు కాకినాడలోని 26వ డివిజన్‌లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. రాత్రికి ముమ్మిడివరం నియోజకవర్గం మహిపాల చెరువువద్ద జాతీయ రహదారి పక్కన గ్రాండ్ పార్క్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బసచేస్తారు.

● 25న గురువారం ఉదయం 10.30గంటలకు పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం, 11.45 గంటలకు అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, 12.25 గంటలకు అల్లవరం మండలం రెల్లుగడ్డ గ్రామం, 2.40 గంటలకు రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం, సాయంత్రం 5.25 గంటలకు మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం నల్లూరు, 6.20 గంటలకు మండపేట మండలం పాలతోడు గ్రామంలో పర్యటిస్తారు. రాత్రికి అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం చేరుకుని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు.

● 26న శుక్రవారం ఉదయం 10.25గంటలకు బిక్కవోలు, 12.40 గంటలకు నిడదవోలు మండలం పందలపర్రు, 1.20 గంటలకు తిమ్మరాజుపాలెం, 1.55 గంటలకు తాడిమళ్ల, 3.15 గంటలకు గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి ఆమె హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

## ఉత్తమ లబ్ధిదారుడిగా కన్నప్పరాజు

### శాస్త్రీయ విధానంలో అరటి సాగుతో అధిక దిగుబడులు సాధించిన గిరిజన రైతుకు సత్కారం



గుజరాత్‌లోని నవసారి వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కన్నప్పరాజును సత్కరిస్తున్న శాస్త్రవేత్తలు

కొవ్వూరు, జనవరి 23: టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసినట్టు కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త జి.రామానందం తెలిపారు. గుజరాత్‌లోని నవసారి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం 11వ సదస్సు జరుగుతుందన్నారు. ఈ పథకంలో 2022-23లో నిర్వహించిన పరిశోధనా ఫలితాలపై సమీక్షించి చేపట్టవలసిన కార్యాచరణను దిశ నిర్దేశం చేశారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద గిరిజన రైతుల్లో శాస్త్రీయ సాగు విధానంలో ప్రోత్సాహానికి ఆర్థిక సహాయం, నాణ్యమైన మొక్కలు, పోషకాలు, పురుగుల మందులు, సూక్ష్మ పోషకాలు, స్ప్రేయర్స్ అందిస్తోంది. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం లంకలపల్లికి చెందిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజు టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి రూ.4.5 లక్షల నికర ఆదాయాన్ని పొందారు. దీంతో కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి నవసారి వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి జెబీ సబేల్, ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ వీబీ పాటిల్, వైఎస్ఆర్‌హెచ్‌యూ రిటైర్డ్ ఉపకులపతి బీఎంసీ రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్ సత్కరించారు. కన్నప్పరాజును ప్రోత్సహించిన కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను అభినందించారు.

## రెస్టారెంట్‌లో విజిలెన్స్ తనిఖీలు

### ఐదు గృహ వినియోగ సిలిండర్ల స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలంలోని రెస్టారెంట్లు, కర్రీపాయింట్లలో విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేశ్ బాబు ఆధ్వర్యంలో తనికీలు చేశారు. రాజానగరం మార్కెట్ రోడ్‌లోని అమృత రెస్టారెంట్‌లో వాణిజ్యావసరాల కోసం వినియోగిస్తున్న ఐదు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకు న్నారు. రెస్టారెంట్ యజమాని పామర్తి రమేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. గృహ వినియోగ సిలిండర్లను వాణి జ్య అవసరాలకు వాడడం నేరమన్నారు. అలా వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ సిలిండర్లను అందజేస్తున్న వారిపై కూడా నిఘా పెట్టామని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ జగన్నాథరెడ్డి, డీసీటీవో షబ్బీర్, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏఐకేఎంఎస్ సర్వసభ్య సమావేశం

రాజానగరం, జనవరి 23: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం బుధవారం రాజానగరంలోని డివిజన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ జిల్లా స్థాయి సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట్‌నాయుడు ఓ ప్రకటనలో కోరారు. ఏఐకేఎంఎస్, కార్మిక సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు విచ్చేసే ఈ సమావేశానికి రైతు కూలీ సంఘ సభ్యులంతా విధిగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

### రేపు ఏఐకేఎంఎస్ మహాసభ

ఈ నెల 25న రాజానగరంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 10వ మహాసభను జయప్రదం చేయాలని వింజుమళ్ల చిట్టిబాబు, కుంజా దూలన్న కోరారు. ఈ సందర్భంగా స్థానిక అన్నదాన సంత్రం కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాలు.. నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెంచడం వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. సమావేశంలో రైతుకూలీ సంఘం నాయకులు పెంటపల్లి భీమశంకర్, శాగంటి లక్ష్మి, చీకట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## 'మైనార్టీల్లారా మేల్కోండి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: మైనార్టీలంతా మేల్కొనాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం ఆజాద్‌చౌక్‌లో మంగళవారం రాత్రి సిటీ నియోజకవర్గం టీడీపీ ఆధ్వర్యంలో నారా హమారా- టీడీపీ హమారా నినాదంతో నూర్‌బాషాసాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు చేశారు. భారీ కేక్‌ను కట్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో మసీదుల అభివృద్ధి, షాదీ ఖానాల నిర్మాణం, ముస్లిం బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి నిధులు మంజూరై పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని, దురదృష్టవశాత్తు ప్రభుత్వ మారడంతో అభివృద్ధి పనులు జరగకుండా వైసీపీ ప్రజాప్రతినిధులు ఆపేశారన్నారు.